ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7 కనిష్ఠం 20.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 5 మార్చి 2025



రేపు దోస్‌పల్లి ఉప పీఠానికి జగద్గురు రాక

మద్నూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : అనంత్ శ్రీ విభూషిత్ జగద్గురు రామానందాచార్య శ్రీస్వామి నరేంద్రఆచార్య మహరాజ్ గురువారం జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి ఉప పీఠానికి వస్తున్నట్లు భక్తులు తెలిపారు. జగద్గురు రాకను పురస్కరించుకొని భక్తులు ఆయా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. గురు, శుక్ర వారాల్లో ఉప పీఠంలోనే స్వామీజీ ఉంటారని తెలిపారు. ఈ ఉప పీఠానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు భారీ సంఖ్యలో రానున్న దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో.. సిజేరియన్లకే మొగ్గు



- జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా పెరిగిన సిజేరియన్లు
- కాసుల సంపాదనకే ఆపరేషన్లు
- సిజేరియన్లతో తల్లీ, బిడ్డకు అనారోగ్య సమస్యలు
- మొదటి కాన్పులో సాధారణ ప్రసవాలే చేయాలని ప్రభుత్వ ఆదేశాలు
- సర్కారు ఆదేశాలను పాటించని యాజమాన్యాలు

కామారెడ్డి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మహిళల సాధారణ కాన్పులు పెంచడంలో ప్రైవేట్ ఆసుపత్రులు నిర్లక్ష్యం వీడడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పలు పర్యాయాలు ఆదేశించినప్పటికీ కాసుల కోసం ఆశపడి ప్రైవేట్ ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్ డెలివరీలు చేస్తున్నారు. ఓ వైపు ఆసుపత్రి ఖర్చులను భరించడంతో పాటు సిజేరియన్ తర్వాత వచ్చే సమస్యలను మహిళలు ఎదుర్కోవాల్సి వస్తోంది. శస్త్ర చికిత్స డెలివరీలు నిర్వహిస్తేనే ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు కాసుల గలగలలు ఉండనుండడంతో ఆ దిశగా కాన్పులు చేస్తున్నారు. దీంతో సాధారణ కాన్పుల వైపు దృష్టి సారించడం లేదు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడలలో గల పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇష్టారీతిన ప్రసవ కోతలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు ముందు నుంచి సన్నద్ధం చేయకపోవడం గర్భిణుల కుటుంబీకులు సాధారణ ప్రసవానికి ముందుకు రాకపోవడం ఇతరత్రా కారణాలు అందుకు దోహదం చేస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లో డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాసులు ఆర్జించేందుకే ఆపరేషన్లు

జిల్లాలో గత 5 సంవత్సరాల కాలంలో మొత్తం దాదాపు రెండున్నర లక్షలకు పైగానే ప్రసవాలు జరగగా అందులో ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 1 లక్షకుపైగా, సిజేరియన్‌లు 40వేల వరకు జరుగగా ప్రైవేట్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 30 వేలు, సిజేరియన్‌లు 70వేలకుపైగా జరిగాయి. ఈ లెక్కలను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న సిజేరియన్ల తీరు అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడంతో ప్రైవేట్ ఆసుపత్రుల ధనార్జన తగ్గిపోవడం వల్ల ఆపరేషన్లకే మొగ్గు చూపుతూ అధికారుల కళ్లు కప్పేందుకు తూతూ మంత్రంగా నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు సరిగా లేకపోవడం, బెడ్డులు సరిపడా లేకపోవడం, డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత వల్ల డెలివరీలు చేయడం ఆలస్యం అవుతుండడం, ఉన్నచోట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఇలా వెళ్తున్న వారిని వదిలిపెట్టకుండా అవసరం లేకున్నా డబ్బులు ఆర్జించేందుకే సిజేరియన్‌లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లపై వైద్య ఆరోగ్యశాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటేనే సిజేరియన్లు తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని లోటు పాట్లపై దృష్టి సారించి అప్పుడప్పుడు జరుగుతున్న సిజేరియన్లను సైతం తగ్గించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సిజేరియన్ల వల్ల కలిగే అనర్థాలెన్నో..

సిజేరియన్లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ డెలివరీలో పుట్టి చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టి చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పడుతాయని అంటున్నారు. అదేవిధంగా శస్త్రచికిత్స జరిగేటప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఏర్పడడమే కాకుండా సాధారణ ప్రసవం అయిన వారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. మత్తులో ఉండడం వల్ల పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వెన్నునొప్పులతో ఎక్కువ శాతం ఇబ్బందులకు గురవుతారు. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కో వలసివస్తుందని నిపుణులు అంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అనేక రకాల నిబంధనలు తీసుకువస్తున్నా అవి కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నట్లు తెలుస్తోంది. వాటిని అమలు చేయాల్సిన అధికారుల అలసత్వం వల్లే ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరుగుతున్న సిజేరియన్లకు సంబంధించిన లెక్కలను చూసి కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటూ తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రసవాలు జరుగుతున్న తీరుపై పలు సూచనలు చేయగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసరమైతేనే సిజేరియన్‌లు చేస్తుండగా ప్రైవేట్ ఆసుపత్రుల తీరు మాత్రం మారడం లేదని తెలుస్తోంది. మొదటి కాన్పు ఖచ్చితంగా సాధారణ ప్రసవమే చేయాలని ఆదేశాలు ఉన్నా బేఖాతారు చేస్తున్నారనే వాదనలు లేకపోలేదు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



కామారెడ్డిలో హాల్‌టికెట్ నెంబర్‌లను వేస్తున్న సిబ్బంది

- నేటి నుంచి మార్చి 22వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షలు
- ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభం
- 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతి
- జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 18,472 మంది విద్యార్థులు
- జిరాక్స్ సెంటర్లపై నియంత్రణ ఉండేనా?

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి మార్చి 22వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాసేవిధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఆయా పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నెంబర్లను కేటాయించి పరీక్షలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రం చుట్టు పక్కల 144 సెక్షన్ విధించడంతో పాటు జిరాక్స్ సెంటర్లను ఎక్కడికక్కడ మూసివేసేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్షకు గంటముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందు నుంచే అనుమతించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

జిల్లాలో 38 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో మొత్తం 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 20అర్బన్ కేంద్రాలు, 18 రూరల్ కేంద్రాలు ఉన్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 38 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 38 మంది డీవోలు, 6 సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 18,472 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 8,743 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా ఇందులో జనరల్ 6,828, ఒకేషనల్ 1,915 మంది, ద్వితీయ సంవత్సరంలో 9,729 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా ఇందులో జనరల్ 8,339, ఒకేషనల్ 1,390 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా గంట ముందే పరీక్ష కేంద్రాలకు హాజరై తమకు కేటాయించిన సెంటర్ల వద్ద హాల్ టికెట్ నెంబర్ ఆధారంగా రూమ్ నెంబర్‌ను చూసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తామన్నారు. కావున విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచిస్తున్నారు.

సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారులు నిబంధనలను పక్కాగా అమలులోకి తీసుకువచ్చారు. పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాలని సూచించడంతో పాటు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఇంటర్ అధికారులు, సంబంధితశాఖ అధికారులతో సౌకర్యాలపై చర్చించారు. ఈ పరీక్ష నిర్వహణలో వైద్య, విద్యుత్, పోలీసు, ఆర్టీసీ శాఖ ఉద్యోగులు పాలు పంచుకోనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్‌సెంటర్లనుమూసి ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతీసారి నిబంధనలను పట్టించుకోని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు

పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరుగకూడదనే ఉద్దేశ్యంతో అధికారులు ముందుస్తుగానే జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేస్తున్నా జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ లాంటి ప్రాంతాల్లో నిబంధనలు ఏ మాత్రం లెక్క చేయకుండా ప్రతీసారి పరీక్ష ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే జిరాక్స్ సెంటర్లను తెరుస్తున్నారు. జిరాక్స్ సెంటర్లను తెరిచి ఉంచినప్పటికీ నియంత్రణ చర్యలు చేట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పరపాటిగా మారింది. ఈ సంవత్సరమైన జిరాక్స్ సెంటర్ల మూసివేతపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారా లేక ప్రతీసారి మాదిరి చూసీచూడనట్లు వ్యవహరిస్తారో వేచి చూడాలి.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం

- సలాం, ఇంటర్ నోడల్ అధికారి

జిల్లాలో నేటి నుంచి జరగనున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. మొత్తం 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 18,472 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. అరగంట ముందు నుంచి పరీక్ష కేంద్రాల్లోకి పంపుతాం.



భిక్కనూరు టోల్‌గేట్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద గ్రామస్థుల ఆందోళన

- తమ వాహనాలకు టోల్ వసూలు చేయొద్దని డిమాండ్

భిక్కనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామస్థులు భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అరగంట పాటు ఆందోళన నిర్వహించారు. తమ వాహనాలకు టోల్ వసూళ్ల చేయవద్దని డిమాండ్ చేస్తూ టోల్‌గేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా టోల్ బూత్‌లను మూసివేసి తమ వాహనాలను ఉచితంగా పంపించాలని నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భిక్కనూరులో టోల్ ప్లాజా ఏర్పాటు అయినప్పటి నుంచి తమకు మినహాయింపు ఇచ్చారని, ప్రస్తుత యాజమాన్యం మాత్రం తమకు టోల్ వసూళ్ల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ చుట్టూ తమ వ్యవసాయబావులు ఉన్నాయని ప్రతిరోజూ చాలా సార్లు తమ వ్యవసాయబావుల వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. యాజమాన్యానికి గత కొన్నిరోజుల క్రితం తమకు టోల్ వసూలు చేయొద్దని వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు టోల్ మేనేజర్ ప్రకాష్ గ్రామస్థులతో మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్ పల్లి, భిక్కనూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ మహేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ఎల్లారెడ్డి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రెండవ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ కాలనీలో నెలకొన్న తాగు నీటి సమస్య, పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మహేష్, మున్సిపల్ ఏఈ వినోద్‌కు వినతి పత్రం కాలనీవాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, లింబ్యా నాయక్, సాయి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం

నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా మాచారెడ్డి ఎంపీడీవో గోపి బాబు, ప్రధాన కార్యదర్శిగా సదాశివనగర్ ఎంపీడీవో సంతోష్‌కుమార్, కోశాధికారిగా గాంధారి ఎంపీడీవో రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా మద్నూర్ ఎంపీడీవో రాణి, జాయింట్ సెక్రెటరీగా పిట్లం ఎంపీడీవో కమలాకర్, కార్యవర్గ సభ్యులుగా సాజిద్‌అలీ, నాగవర్ధన్, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



లింగంపేటలోని జగన్నాథ గుట్టపై నీటి గుండాన్ని పరిశీలిస్తున్న పీడీ

ప్రాచీన కట్టడాల పర్యాటక కేంద్రంగా లింగంపేట

- డీఆర్‌డీవో పీడీ సురేందర్

లింగంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రాన్ని ప్రాచీన కట్టడాల పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని డీఆర్‌డీవో పీడీ సురేందర్ అన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని జగన్నాథ ఆలయం, ఆలయం వద్ద ఉన్న తరగని నీటి గుండం, ఆలయం నుంచి మెదక్ ఖిల్లాకు ఉన్న సొరంగ మార్గాలను ఆయన పరిశీలించారు. మండలంలో అబ్బురపరిచే ప్రాచీన కట్టడాలు ఉన్నాయని ఇప్పటికే నాగన్న బావి (మెట్ల బావి)ని పునరుద్ధరించామన్నారు. నగరేశ్వర ఆలయం వద్ద ఉన్న గాలి గోపురం, జగన్నాథ ఆలయం వద్ద బండరాయిపై ఉన్న తరగని నీటి గుండం, ఆలయం వద్ద నుంచి మెదక్ ఖిల్లాకు నిర్మించిన సొరంగ మార్గాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఇవే కాకుండా ప్రాచీన రామాలయం, శివాలయాలు ఉన్నాయన్నారు. వీటన్నింటిని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో అభివృద్ధి చేసి మండలాన్ని మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలియజేశారు. నాగన్న మెట్ల బావి సమీపంలో త్వరలోనే మరుగుదొడ్లను నిర్మించి పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆయన తెలిపారు. జిల్లాలో రెండు ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను ప్రారంభిస్తున్నామని వాటిలో ఒకటి లింగంపేటలో ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు. మండలంలో జరుగుతున్న ఏఆర్‌ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, కార్యదర్శి శ్రావన్‌కుమార్, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌లు ఉన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలనర్సు డిమాండ్ చేశారు. మంగళవారం డీపీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు మార్చి 4వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా పంచాయతీ అధికారులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలైన రాష్ట్రంలోని పెండింగ్ వేతనాల అమలు, చెక్కుల ద్వారా ఎస్టీవోలో ఆగిపోయిన వేతనాలు చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న అసెంబ్లీలో కార్మికుల సమస్యలపై చర్చించాలని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

- క్షీరాభిషేకం, సింధూర పూజలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఆలయ నిర్వాహకులు

7

రంజాన్ వేళలు



బుధవారం	గురువారం
ఇఫ్తార్ సా.6.30	సహర్ ఉ.5.09

ఉపవాస దీక్షల వల్ల మనోవాంఛలకు తెరపడుతుంది. ఐహిక భోగభాగ్యాల వృథా కోరికలు తగ్గుతూ పరలోక భీతి భావం పెరుగుతోంది. ఉపవాస స్థితిలో పేదల పట్ల సానుభూతి వారి ఆకలి దప్పికలు గుర్తుకు తెస్తాయి.

బోధన్‌లో మొరాయించిన రైల్వే గేట్



బోధన్‌లో రైల్వే గేట్ మొరాయించిన దృశ్యం

● ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులకు ఇబ్బందులు

బోధన్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న రైల్వే గేట్ మొరాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు ఎండ వేడిని తట్టుకోలేక అనేక ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ఉదయం 12.55 నిమిషాల సమయంలో రైల్వే గేట్ మొరాయించింది. సాంకేతిక లోపంతో గేట్ తెరచుకోకపోవడంతో బోధన్ - బాన్సువాడ రహదారిపై ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లే క్రమంలో రైల్వే అధికారులు గేట్లు వేసి తిరిగి గేట్‌ను తెరిచే సమయంలో గేట్ మొరాయించింది. దీంతో రైల్వే సిబ్బంది గేట్‌ను తెరిచేందుకు అనేక రకాల చర్యలు చేపట్టారు. గంట పాటు రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టి గేట్‌ను బాగు చేశారు. గంట పాటు ప్రయాణీకులు ఎటు వెళ్లలేక ట్రాఫిక్‌లోనే ఇరుక్కుని ఎండకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



ఉపాధిహామీ కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో

రెంజల్,మార్చి 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధూపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పరిశీలించారు. కూలీలకు సంబంధించిన హాజరు పట్టికను పరిశీలించి చెరువులో చేపడుతున్న పనులను పరిశీలించారు.కూలీలు మొత్తం 56మంది హాజరు కావడంతో కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలును సూచించారు. వేసవి దృశ్య ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో కూలీలకు తాగునీరుతో పాటు ఎండ తగలకుండా పనిప్రదేశంలో షమీయానాలను ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను సూచించారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు మోటివేషన్ చేస్తున్న సహన

మోర్తాడ్‌మార్చి4 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలని మోటివేటర్ టి. సహన అన్నారు. మంగళవారం మండలంలోని సుంకెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపట్ల మోటివేటర్ టి.సహన శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన కోసం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మనోధైర్యంతో ఉండాలని, తనలో ఉన్న లక్షణాలు చెప్పుకోవాలని, పాజిటివ్ మైండ్ సెట్‌తో ఉండాలని, డబ్బు సంపాదించడంతో పాటు సేవ చేయడం కూడా తప్పనిసరి అనివిద్యార్థులకు భోదించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంతోష్‌కుమార్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన దుస్తులను చూపుతున్న బాధితురాలు

బోధన్‌రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని 17వ వార్డు ఉద్మీర్‌గల్లీలో మామిడివద్ద మంగళవారం ఒడ్డెమ్మ అనే మహిళ రేకుల ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదానికి గు రైంది. స్థానికులు విషయాన్ని ఒడ్డెమ్మ కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటినా ఘటన స్థలానికి తరలివచ్చారు. మంటలు ఎగిసిపడటంతో మంటలను ఆర్పడం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు మనుమరాలి పెళ్లికి రూ.లక్షా 50 వేల డబ్బును, ఐదు తు లాల బంగారాన్ని ఇంట్లో పెట్టి తమ మనుమరా లికి పెళ్ళి బట్టల కొనుగోలుకై నిజామాబాద్ వెళ్లడం జరిగిందన్నారు. అనంత రం విద్యుత్ షాక్ ఘటనను విద్యుత్ అధికారులు, అగ్ని మాపక అధికా రులకు తెలియజేశామన్నారు. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంట లను అదుపులోకి తీసుకువచ్చి మంటలను ఆర్పారు. ఈ అగ్ని ప్రమా దంలో నగదు, బంగారం, నిత్యావసర సరుకులు, బట్టలు అగ్నికి ఆహుతి అయ్యాయని బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వంఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ఆర్మూర్‌రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఏర్గట్ల రాజుబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడలు, సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పోచ న్న, డీఈఈభూమన్న వినోద్, హెచ్‌ఎం చేతనకుమారి, పెర్కిట్ హెచ్‌ఎం శ్రీనివాస్, సుమన్, అశోక్, గంగాధర్, రవి, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

ముప్కాల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఎస్‌వో జి.వినోద అన్నారు. మంగళవారం పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ పథకం రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సూర్యనారాయణ,ఏఎన్‌ఎం స్వరూపరాణి, మమత, ఆప్తాల్మిక్ వైద్యుడు గురురాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన

వేల్పూర్, మార్చి4(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీసీ ఈసీ, షీటీం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థిని లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం రాజ న్న, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ,మహిళ కానిస్టేబుల్ సౌజన్య, సు మతి, రాజ్‌పాల్,ఇన్‌చార్జీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు,పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బాన్సువాడటౌన్ , మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ నాయకులు ఖలీల్ అన్నారు. అరెస్టు అయినవారిలో మినీ అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



ముప్కాల్ ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



లక్ష్మీనర్సింహస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్న పురోహితులు

ముప్కాల్, మార్చి4(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండల కేంద్రంలోలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు ధరించి ఎదుర్కొలుగా భాజభజంత్రీలతో మండ పానికి తీసుకువచ్చి వేదమంత్రోచ్చారణాల మధ్యఅంగరంగా వైభవంగా లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని నిర్వహిచారు.ఈకల్యాణాన్ని భక్తులుపాల్గొన్నా రు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ఉత్సవాలు ప్రతిష్ఠాపన

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామంలో లక్ష్మీ నర్సింహస్వామి నామస్మరణాలతో పులకరించిన భక్తిశ్రద్ధలతో గ్రామస్థులు వేదపండి తుల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని మొదటి రోజు వైభవంగా ప్రారంభించారు.ఆలయ ఆవరణలో పండితులు ముందుగా జలదివాసము పూజలు నిర్వహించారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ పూజల్లో పాల్గొని ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అలవార్చుకోవాలని వివరించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారి విగ్రహాన్ని ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఘనంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కోటగిరి: గ్రామ శివారులో కొత్తగా నిర్మించిన ఆల యంలో నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్ర ముఖ వేద పండితులు రాజు మహారాజు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేద మంత్రోచ్ఛారణ మధ్య కొనసాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు : ఎంఈవో



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి

కోటగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కోటగిరి ఎంఈఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలలో భాగంగా 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. దేశ విదేశాల్లో ఎంతోమంది విద్యార్థులు స్థిరపడ్డారన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నిర్వహించడం విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ ఎంఈఓ శంకర్, పిఆర్‌టియు నాయకులు బర్ల సాయిలు, ఉదయ్ చందర్, హర్షిద్ హుస్సేన్, రవీందర్, నాయకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్ రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి రాజీమంజుషా అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లె జనార్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. పరీక్షల కంటే భయ పడవద్దని, ఇష్టపడి చదివితే విజయం సాధించవచ్చ న్నారు.అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహ సీల్దార్ శశిభూషణ్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ శంకర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గం గారం, డిస్కో సాయిలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



పోస్టుకార్డులను చూపెడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల పైచిలుకు స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ద్వారా డిమాండ్‌లను పంపారు. విద్యరంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించాలని, పేదవిద్యార్థులు, పూర్వవిద్యార్థుల స్కాలర్‌షిప్ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వడంలేదని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యు డివిజన్ ఉపాధ్యక్షుడు హుస్సేన్, నాయకులు రాహుల్, కళ్యాణ్, పవన్, అక్షయ్, ప్రణయ్, నిఖిల్, భువనేష్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ పాఠశాల తనిఖీ

కమ్మర్‌పల్లి,మార్చి 4:(ఆంధ్రజ్యోతి)కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో రాజా శ్రీనివాస్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులను విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేవిధంగా చూడాలని స్థానిక హెచ్‌ఎం రాజేశ్వర్‌కు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ప్రభుత్వ మెనూ ప్రకారం రుచి సుచికరమైన భోజనాలు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కందకుర్తి రోడ్డు సమీపంలో ఉన్న వైన్స్ వద్ద మంగళవారం బైక్‌చోరీకి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నవీపేటకు చెందిన పి.అశోక్ తన సీడీ డీలక్స్ బైక్‌ను వైన్స్ వద్ద నిలిపి పక్కనే ఉన్న పర్మిట్ రూమ్‌లోకి వెళ్లాడు. తిరిగి వచ్చిన తరువాత చూస్తే బైక్ కనిపించలేదు. వైన్స్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి మారుతాళం చెవితో బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు నమోదు అయింది. ఈ విషయంపై బాధితుడు నవీపేట పోలీసులకు సమాచారం అందించాడు. గత వారం పది రోజులలో మండల కేంద్రంలో పదికిపైగా బైక్‌లు చోరీకి గురయ్యాయి. బైక్ దొంగలను త్వరగా పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ రైతును ఆదుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతును ఆదుకోవాలని కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కిసాన్‌సంఘ్ 46 వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు పెద్దఅంజన్న, జోనల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, సాయిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, మండల అధ్యక్షుడు చిన్నఅంజన్న, మండల ప్రధానకార్యదర్శి భాస్కర్, భైరవ రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డి,మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భార్య వివాహేతర సంబంధమే భర్త చావుకు కారణం అయిన సంఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మ్యాతరి, సతీష్ 42సంవత్సరాలు. అతనికి 17సంవత్సరాల క్రితం గాంధారి మండలం గౌరారం గ్రామానికి చెందిన అనితతో పెళ్లయింది. వీరిద్దరికీ ఇద్దరు కుమారులు ఉన్నారు. సతీష్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎల్లారెడ్డి పట్టణంలో నూతనంగా పేదలకు అందించిన రెండు పడక గదుల ఇల్లు రావడంతో భార్య పిల్లలతో గృహప్రవేశం చేసుకొని అక్కడే నివాసం ఉంటున్నాడు. సతీష్ భార్య అనిత వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో మార్చి మూడో తేదీ రాత్రి సమయంలో భార్యాభర్తల మధ్య పెద్దగా తగాదా రావడంతో మనస్థాపానికి గురైన సతీష్, తన ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల ఫారం వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు గ్రామస్తులు పోలీసులకు తెలిపి నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం సతీష్ మృతి దేహాన్ని గమనించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు, సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని, మృతుడి, తల్లి మ్యాతరి పద్మ తన కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన బైక్ లభ్యం

నవీపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల చోరీకి గురైన బైక్ మంగళవారం లభ్యమైంది. గత వారం రోజులుగా మండల కేంద్రంలోని పలు వీధులలో బయట నిలిపి ఉంచిన పలు పుర బైక్‌లను గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఇందులో చోరీకి గురైన హోండా షైన్ బైక్‌కు మంగళవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ గోడ వెనుక వైపున లభ్యమైంది. స్థానికుల సమాచా రం మేరకు సంబంధిత బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లభ్యమైన బైక్‌కు చెందిన లైట్ ముందు భాగం ధ్వంసం చేయడంతో పాటు నెంబర్ ప్లేట్‌తో సహా పలు పార్ట్‌లను దొంగలు తొలగించారు. సంఘటన స్థలంలో లభ్యమైన పలు ఆధారాల మేరకు బైక్ దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంక్సాపూర్‌లో అంగన్‌వాడి కేంద్రం తనిఖీ



అంక్సాపూర్‌లో అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

వేల్పూర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో బాలకిషన్ తనిఖీ చేశారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని ప్రతీరోజు పిల్లలకు అందించాలని సూచించారు. వండే వంట పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని, ఆహార పదార్థాలు, కూరగాయలు తాజాగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు, గ్రామకార్యదర్శి తదితరులు ఉన్నారు.

పోచంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్క్ అవుట్

వేల్పూర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు మంగళవారం ఎంపీడీవోబాలకిషన్, ఇతర అధికారులు మార్కవుట్ ఇచ్చారు.ఈసంద ర్భంగా ఎంపీడీవో బాలకిషన్ మాట్లాడుతూ మండలంలో పోచంపల్లి గ్రామానికి మొదటిదఫా కింద ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయ న్నా రు. మంజూరైన కొన్ని ఇళ్ల నిర్మాణానికి మార్కవుట్ చేశామని, మరో మూడు రోజులలో మిగిలిన ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ ప్రభు, సహాయ ఇంజనీర్ సత్యనారాయణ, కార్యదర్శి సమత, ఇతర గ్రామాల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

11న డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్,మార్చి4(ఆంధ్రజ్యోతి):ఈనెల 11న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్ ఆన్ జీఎస్టీ తీయరి టు ప్రాక్టిస్ అనే అంశంపై కార్యశాల నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ డీన్ ప్రొఫెసర్ జి.రాంబాబు, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ జి.శ్రీనివాస్, మహేందర్‌లు హాజరవుతారని ఆయన తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో అధ్యాపకులు జి.లింగన్న, ఇ.రాజ్‌కుమార్, ఎన్.అంబర్‌సింగ్, జాన్‌సుకుమార్, వి.శ్యామ్‌కుమార్, రహమన్, వెంకటేశ్వర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్,మార్చి4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోనిజిరాయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని సందర్శించి మెను ప్రకారం భోజ నా న్ని ఏర్పాటు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. విద్యార్థులకు కనబడే విధంగా మెనును ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంకి సూచించారు.ఆయన వెంట మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా చేయాలి

బీర్కూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ భాను ప్రకాష్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల ను ఆదేశించారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఎంపి డిఓ కార్యాలయంలో ఎంపిడిఓ భాను ప్రకాష్ పంచాయతీ కార్యదర్శుల తో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనీల్, మహబూబ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



పాలెంలో మధ్యాహ్న భోజన వంటకాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, మార్చి4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు మెనూప్రకారం నిబంధనల మేరకు భోజన సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో తిరుమల అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడి సెంటర్‌లను తనిఖీచేశారు.పాఠశాలలో మధ్యాహ్నభోజన వంటకాలను స్వయంగా పరిశీలించారు.విద్యార్థులు భోజనం చేస్తున్నప్పుడు వారిభోజనాన్ని, వంటలను పరిశీలించారు.అంగన్‌వాడీ సెంటర్‌లో కూడా పరిశీలించి పిల్లలకు నిబంధనల మేరకు పోషక ఆహారాన్ని అందించాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. వీరి వెంట ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



పోతంగల్‌లో బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్కా కొమురయ్య ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పోతంగల్ మండల కేంద్రంలో మంగళవారం బిజెపి నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు హన్మాండ్లు, మక్కయ్య, నాగం సాయిలు, శేఖర్, అశోక్, కిరణ్, శంకర్ తదతరులు పాల్గొన్నారు.

నవీపేట:ఇటీవల జరిగిన మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య గెలుపొందడం పట్ల మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశీ మోహన్, శ్రీనివాస్ గౌడ్, పిల్లి శ్రీకాంత్, ఆనంద్, రాజేందర్ గౌడ్, రాము, ప్రవీణ్, రాధ పాల్గొన్నారు.

అంకాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



అంకాపూర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మార చంద్రమోహన్

ఆర్మూర్‌రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో మంగళవారం రోడ్డు నిర్మాణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ మార చంద్రమోహన్ ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో బోడగుట్ట హనుమాన్ మందిరం వద్ద సీసీరోడ్డు నిర్మించనున్నారు.ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ మట్ట అమృత్‌రావు, మాజీ ఎంపీ టీసీ ఎంసీ.గంగారెడ్డి, గోపాల్, గంగామోహన్, ఆలయ కమిటీ సభ్యులు రవి, సంతోష్, కిషన్, బీమయ్య పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయం



విద్యుత్ సిబ్బందిని అభినందిస్తున్న దృశ్యం

● ట్రాన్స్‌కో డీఈ ఎం.డి.ముక్తార్

బోధన్ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాము కూడా ఆ విధంగా విధులు నిర్వహిస్తున్నామని బోధన్ ట్రాన్స్‌కో డీఈ మహ్మద్ ముక్తార్ తెలిపారు. మంగళవారం బోధన్ మండలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని కరెంట్ పనులు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బోధన్ ట్రాన్స్‌కో కార్యాలయంలో అవగాహన కల్పించారు. జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం, సిబ్బంది సంస్థ అభివృద్ధికి అందిస్తున్న అపరిమిత సేవలను ప్రశంసిస్తూ వినియోగ దారులకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగేందుకు కష్టపడే విద్యుత్ సిబ్బంది సేవలను గుర్తించి బహుమతులను అందజేసి గౌరవించడం జరిగిందన్నారు. ప్రతి విద్యుత్ సిబ్బంది తమ బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నగేష్‌కుమార్, బోధన్ టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ, గంగాధర్, పెంటయ్య చారి, జనార్ధన్, రమేష్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవీపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియేట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని నవీపేట మోడల్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షా కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. నవీపేట, రెంజల్ మండలాలతో పాటు రెంజల్ మండల మైనారిటీ బాలికల గురుకుల కళాశాల, మోకన్‌పల్లి కేజీబీవీ కళాశాల, నవీపేటలోని నవోదయ జూనియర్ కళాశాలలకు చెందిన 401 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కోటగిరి:కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా పేర్కొన్నారు. జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 217 మంది, ద్వితీయ సంవత్సరంలో 229 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్, మార్చి4(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ దండోల దాసు అనే వ్యక్తికి రెండు రోజుల సాధారణ జైలు శిక్షను సెకండ్ క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ విధించినట్టు మంగళవారం ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అతిగా మద్యం తాగి వాహనాన్ని నడుపుతున్న దాసును గుర్తించి కోర్టులో ప్రవేశపెట్టగా రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడించినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఫటా..ఫట్...

మహిళలను ఉన్నత స్థానానికి చేర్చడమే లక్ష్యం

● ఉదయశ్రీ, మెప్మా టీఎంసీ



ప్రశ్న: మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు ఎన్ని మహిళ సంఘాలు ఉన్నాయి, కొత్త మహిళ సంఘాలు ఏర్పాటు చేస్తున్నారా?

జవాబు: ఇప్పటి వరకు మున్సిపల్ పరిధిలో 11వేల 60 మహిళా సంఘాలు ఉన్నాయి. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 46 కొత్త సంఘాలను ఏర్పాటు చేశాం.

ప్రశ్న: మహిళలకు ఏ విధంగా అభివృద్ధి చెందేలా తోడ్పడుతున్నారు?

జవాబు: మహిళ సంఘం ద్వారా వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి ద్వారా సెల్ఫ్ లోన్‌లను బ్యాంకుల ద్వారా ఇప్పిస్తున్నాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని సంఘాలకు ఎంత లోన్ అందజేశారు?

మెప్మా టీఎంసీ: ప్రస్తుతం 149సంఘాలకు రూ.17కోట్ల 87లక్షల 87వేల లోన్ సౌకర్యం కల్పించాం. అలాగే ఇందిరా మహిళ శక్తిద్వారా 74మందికి రూ.ఒక కోటి 81లక్షల 95వేల లోన్‌లను అందజేశాం.

ప్రశ్న: మహిళలకు చిన్నపరిశ్రమలకు సహకారం అందించారా?

జవాబు: ఇప్పటికే ఏడు గ్రూపులకు బ్యాంకుల ద్వారా చిన్న పరిశ్రమలకు సహకారం అందించాం. ఏడు గ్రూపులకు కలిసి రూ.54లక్షల 50వేల లోన్ అందజేశాం.

ప్రశ్న: వీధి వ్యాపారులకు మెప్మా ద్వారా ఏలాంటి సహకారం అందించారు?

జవాబు: పీఎం స్వనిధి ద్వారా రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వీధి వ్యాపారులకు రుణం అందజేస్తున్నాం. ఇప్పటికే 6504మంది వీధి వ్యాపారులకు మెప్మా ద్వారా రుణాలు అందజేశాం.

● (ఆంధ్రజ్యోతి, ఆర్మూర్ టౌన్)

ఎమ్మెల్యేను కలిసిన జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు



ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సన్మానించిన జక్రాన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు

జక్రాన్‌పల్లి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కలిశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపతిరెడ్డిని రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, జక్రాన్‌పల్లి మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, వీడీసీ సభ్యులు కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. ఆర్అండ్‌బీ రోడ్డు మిగిలిపోయిన పనులు రూ.50 లక్షల మండల పరిషత్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు చేపట్టే బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే మిగిలి పోయిన పనులకు ప్రారంభించాలని ఈ నిధులను కంటిన్యూ చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలో మిగిలిపోయిన పనులకు చేసేందుకు సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని పరిశీలించిన చైర్మన్

భీమ్‌గల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని కుమ్మరిగల్లీలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని చైర్మన్ అంజిరెడ్డి రాజారెడ్డి మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు, ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశాలిచ్చారు. త్వరలో తెలంగాణ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల అవకాశాలు ఉన్నందున భవనాన్ని నిరుద్యోగులకు ఉపయోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పాఠశాల సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని గ్రంథ పాలకుడును ఆదేశించారు. గ్రంథాయ అభివృద్ధి విజయమై స్థానిక కాంగ్రెస్ నాయకులతో అడిగి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెజె. నర్సయ్య, మాజీఎంపీపీ కన్నె సురేందర్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పర్స అనంత్‌రావు, కాంగ్రెష్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరేపల్లి నాగేంద్ర బాబు, మాజీ కౌన్సిలర్‌లు మల్లెల రాజాశ్రీ, లక్ష్మణ్, సీహెచ్.గంగాధర్, దరావత్ లింగయ్య, మైనారిటీ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ జీషాన్, సాయిబాబా, మొండి దినేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



భీమ్‌గల్ గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

లోక కల్యాణార్థం మహా సుదర్శన యాగం



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

● బాలయోగి కృష్ణ మహారాజ్



ఆలయంలో సుదర్శన యాగం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణార్థం కోసం ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ బోధన్ పట్టణంలోని బసవ తారకనగర్‌లో గల కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా మహా సుదర్శన యాగం కార్యక్రమం నిర్వహించినట్లు బాలయోగి కృష్ణ మహారాజ్ పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం ఆలయంలో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపకులు పసులోటి గోపి కిషన్ తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృత ఫల అభిషేకాలు, మహా పూజ, హారతి ప్రత్యేక పూజలు, మహా సుదర్శన యాగం నిర్వహించామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. చుట్టూ పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బాల యోగి కృష్ణ మహారాజ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రజలు ప్రతిరోజు తమకు నచ్చిన దేవాలయంలో ప్రదక్షిణ చేయాలని, దేవాలయంలో ప్రతీరోజు ఉదయం పూజలు నిర్వహిస్తే దోషాలు తొలగి సకల శుభాలు కలుగు తాయని ఈ సందర్భంగా భక్తులతో పేర్కొన్నారు. మహిళలు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను తప్పకుండా పాటించాలన్నారు. యువకులు దేశం, ధర్మ రక్షణ కోసం పాటుపడాలన్నారు. హిందువులంతా ఐక్యతతో ఉండి ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు కిషోర్, సుధాకర్, కృష్ణ, భీమ్‌రావు, పరమేష్, విజయ్, గోవింద్, కుమార్, లోకేష్, గౌతమ్, లింగం, సిద్దు, వికాస్, మారుతి, శశి,సంతూ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. బుధవారం రథోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ వ్య వస్థాపకులు గోపికిషన్ కోరారు. ప్రతీ సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా వార్షిక బ్రహ్మోత్సవం రెండో రోజు ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు రథోత్సవ కార్యక్రమం ఉంటుందని, పట్టణ ప్రముఖులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కావున ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర పూజలు

రామారెడ్డి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చరణలతో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడిదేవుళ్లకు మొక్కలు మొక్కి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ గంజి సతీష్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవునికి దండా రూపంలో రూ.6,100 దండ రూపంలో దేవుని విగ్రహానికి వేశారు. అంతకుముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో తడిపూజలు నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా భక్తులు హాజరై కట్నకానుకలు సమర్పించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. తమకు ఇంకా కాలభైరవ స్వామి దేవుడు నచ్చితే మరింతగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బూర్ల ప్రభు రామచంద్రం గుప్తా, ఆలయ కమిటీ మాజీ చైర్మెనులు, మాజీ ధర్మకర్తలు, పంతులు వంశీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లి ఆర్‌వోబీపై ప్రారంభమైన రాకపోకలు

ఆర్మూర్‌రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పై నుంచి వాహనాల రాకపోకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నాలుగేళ్ల క్రితం రైల్వేఓవర్‌బ్రిడ్జి పనులు ప్రారంభించారు. నిధుల కొరత వల్ల పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. 2018లో ఆర్మూర్‌లోని మామిడిపల్లి, గోవింద్‌పేట్, మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి వద్ద ఆర్ వోబీ పనుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించినట్టు ప్రచారం జరిగింది. నిధులు మంజూ రైనప్పటికీ పనులు నత్తనడకన సాగాయి. గోవింద్‌పేట్ ఆర్‌వోబీ ఏడాదిన్నర క్రితమే ప్రారంభం కాగా మామిడిపల్లి ఆర్‌వోబీ ఇప్పుడు ప్రారంభమైంది. మామిడిపల్లి వద్ద పనులు చేపట్టడంతో సుమారు ఏడాదికి పైగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులు గాంధీనగర్ మీదుగా హైవేపై నుంచి వెళ్లాల్సి వచ్చేది. దీంతో వాహన దారులు ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు మామిడిపల్లి ఆర్‌వోబీ పనులు పూర్తయి వాహనాలు వెళ్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మామిడిపల్లి ఆర్‌వోబీపై నుంచి వెళ్తున్న వాహనాలు



విద్యారణ్య భారతీస్వామికి తులాభారం చేస్తున్న భక్తులు

హనుమాన్ మాలధారులు భక్తి మార్గంలో నడవాలి

● హంపీ పీఠాధిపతి జగద్గురు విద్యారణ్య భారతీ స్వామి

పిట్లం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాలధారులు భక్తి మార్గం పాటించాలని హంపీ పీఠాధిపతి జగద్గురు విద్యారణ్య భారతీ స్వామీ సూచించారు. మంగళవారం పిట్లం మండలంలోని తిమ్మానగర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాముల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు, భక్తులు, హనుమాన్ మాలధారులు ఘనంగా స్వాగతం పలికారు. హనుమాన్ ఆలయంలో 250 మంది మాలధారణ వేసిన భక్తులకు హంపీ పీఠాధిపతి చేతుల మీదుగా మాల ధరించారు. గ్రామస్థులు, స్వాములు కలిసి హంపీ స్వామికి తులాభారం కార్యక్రమం చేపట్టారు. తిమ్మానగర్, హనుమాన్ ఆలయం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది.

నవనాథ సిద్దులగుట్టను సందర్శించిన అయోధ్య మహారాజ్

ఆర్మూర్‌రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని పవిత్ర పుణ్యక్షేత్రం నవనాథ సిద్దుల గుట్టను మంగళవారం అయోధ్యకు చెందిన పరమానంద్‌జీ మహరాజ్ సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు పర మానంద్‌జీ మహరాజ్‌ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సిద్దేశ్వరునికి పవిత్ర గంగజలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రామాలయం, దత్తాత్రేయ మందిరం, దుర్గమాత ఆలయం, హన్మాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పరమానంద్‌జీ మహరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి.సుమన్, పి.సురేందర్‌రెడ్డి, కోడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, హజరిసతీష్, బట్టు శంకర్, ఖాందేశ్ శ్రీనివాస్, సంధ్య, కొంతం మంజుల మురళీ, ప్రశాంత్‌గౌడ్, రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సిద్దులగుట్టపై సిద్దేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అయోధ్య మహరాజ్

కుకునూర్‌లో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

వేల్పూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుకునూర్ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (పసుపుబాలాజీ) దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం, పుణ్యాహవచనం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం, మండప అర్చన, అగ్నిప్రతిష్ట, బలిహరం వంటి కా ర్యక్రమాలను గ్రామ వైదిక పురోహితులు ప్రశాంత్‌చార్యులు వేద మంత్రో చ్చరణాల మధ్య జరిగాయి. పసుపు బాలాజీ ఆలయం వద్ద జరుగుతున్న ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పంటను రక్షించుకోవడానికి రైతుల అష్టకష్టాలు

● ఎండిన వరి పంటను చూసి ఆందోళన చెందుతున్న రైతులు



తాటిపల్లిలో పశువుల దాణాకు వరి పంటను కోస్తున్న రైతన్న



సిరికొండలో ట్యాంకర్ ద్వారా నీటిని పారిస్తున్న శ్రీనివాస్



ఎండిన వరి పంటను చూసి ఆందోళన చెందుతున్న రైతులు

సిరికొండ మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో సాగు చేసిన వరి పంటకు నీళ్లందక ఎండిపోతుండడంతో పంటను రక్షించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షా కాలంలో ఎంతైతే వరి పంటను సాగు చేశారో దాదాపుగా అటు ఇటుగా రైతులు సాగు చేశారు. వర్షాకాలంలో వాగులు పారాయి.. చెరువులు నిండాయి కదా అనుకుని రైతులు వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం సుమారు 22 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ సారి వేసంగిలో ముందుగా వరి నాట్లు వేసిన రైతాంగానికి భూగర్భ జలాలు అడుగంటి రైతులకు షాకిచ్చినట్లయింది. ఫిబ్రవరి నెల ఆరంభం నుంచే బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టం సాగాయి. నెలాఖరు వచ్చేసరికి దాదాపుగా బోరుబావులు వట్టిపోవడం జరగడం ప్రారంభమైంది. దీంతో కొందరు రైతులు చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా ప్రతీ రోజు నీళ్లను పారిస్తు వచ్చారు. పంట దక్కదు అనుకున్న రైతులు పశుగ్రాసంగా కోసి వేయడం జరిగింది. మరికొందరు రైతులు పశువులను మేపుతు న్నారు. మరికొందరు రైతులు పంటను కాపాడుకోవడానికి వెయ్యి అడుగుల లోతు బోరుబావులు తవ్విస్తున్నారు. నీళ్లు వచ్చిన రతైలుల్లో కొంత ఉపశమనం కలుగుగా నీళ్లు రాని రైతులు దిగాలు పడుతూ రెండు రకాలుగా నష్టపోతిమి అంటు ఉసూరు మంటున్నారు. వేల రూపాయలు పెట్టు బడి పెట్టి నష్టపోతిమి అంటూ ఆందోళన చెందుతున్నారు. ఎండిపోయిన పంటలను చూసి రైతులు తీవ్రమైన ఆవేదనకు లోనవుతున్నారు.

ఇజ్రాయిల్ టెక్నాలజీ టెక్నాలజీ రాదాయే..

21 ప్యాకేజీ పనులు ఏమాయే..!?

ప్రాణహిత చేవేళ్ల పథకంలో 21వ ప్యాకేజీ పనుల పురోగతి లేక పాయే ఇజ్రాయిల్ టెక్నాలజీ అందుబాటులోకి రాకపాయే అని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీలో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మూడెకరాలకు పైపులైను తెచ్చి గోదావరి నీళ్లందిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేళ్లు ఊదరగొట్టింది. కొంత మేరకు ప్రధాన పైపులైను పనులు చేసినప్పటికి వ్యవసాయ పొలాల్లో పైపులు వేయలేక పోయింది. దీంతో సిరికొండ, ధర్పల్లి మండలాల రైతులు బోరు బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పైపుల ద్వారా సాగు నీరందించే పథకం మరుగున పడ్డట్లయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 21 ప్యాకేజీ గ్రావిటీ ద్వారా నీళ్లందిస్తామని చెప్పినట్లు చేస్తుందో లేదో ఇప్పటి వరకు స్పష్టతను ఇవ్వక పోవడంతో రైతుల్లో మరింత ఆందోళన మొదలైంది. ప్రభుత్వం రైతాంగానికి గోదావరి నుంచి సాగు నీళ్లందించే విషయంలో స్పష్టత నివ్వాలని సిరికొండ, ధర్పల్లి మండలాల రైతులు కోరుతున్నారు.

పింఛన్ల కోసం పోస్టాఫీస్‌కు తరలివచ్చిన వృద్ధులు

నాగిరెడ్డిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వికలాంగుల, వివిధ పింఛన్లను మంగళ వారం నుంచి పంపిణీ చేయడంతో నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు తదితరులు భారీగా తరలివచ్చారు. ఆసరా, వికలాంగుల, తదితర పింఛన్లు ఫిబ్రవరి మాసం చివరి వరకు పింఛన్ల కోసం వేచి చూసిన వృద్ధులకు పెన్షన్లు రాక పోగా, మార్చి నెల ప్రారంభం కావడంతో పోస్టాఫీస్ ఖాతాల్లో సోమవారం ప్రభుత్వం డబ్బులను జమ చేయడంతో పోస్టల్ సిబ్బంది మండలంలో మంగళవారం నుంచి పింఛన్లను పంపిణీ చేశారు. మంగళవారం పింఛన్లను పంపిణీ చేస్తున్నట్టు సమాచారం తెలుసుకున్న వృద్ధులు, వికలాంగులు తదితరులు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు భారీగా తరలివచ్చి తమ పింఛన్లు తీసుకున్నారు.





ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

వేసవిలో ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

పెద్ద కొడప్‌గల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని పనులను చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివ్వాపూర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో జరుగుతున్న ఫిష్‌పాండ్స్, ల్యాండ్ లెవలింగ్, ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు సూచించిన కొలతల ప్రకారం పని చేస్తే తగిన వేతనం అందుతుందన్నారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకొని పనులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపీవో సుదర్శన్, టీఏ బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు మష్నారెడ్డి, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గుర్దాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాజారాం

గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి

● మండల ప్రత్యేక అధికారి రాజారాం

తాడ్వాయి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. ఈయన మంగళవారం మండలంలోని బ్రహ్మాజీవాడి సంగోజువాడి గ్రామాల్లో తనిఖీ చేశారు. సంగోజువాడి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ప్రతీ ఒక్కరికి ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచే బాధ్యత అధికారులదేనన్నారు. రాబోవు రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని, నీటి ఎద్దడి నివారణకు పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూసే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భిక్కనూరు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు దివ్య గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వైద్యుల సూచనలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోతారంలో శిలాఫలకం ధ్వంసం

మాచారెడ్డి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలంలోని పోతారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రామంలో 2017 సంవత్సరంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడానికి అప్పటి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రావడంతో శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంతో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల రాములు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు.



కామారెడ్డిలో కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

కామారెడ్డిలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో మంగళవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతును ఏఎస్‌పీ చైతన్యరెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పీ మాట్లాడుతూ భారత హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్‌లో ఒక భాగమైన ఆర్ఏఎఫ్(రాపిడ్ యాక్షన్ ఫోర్స్) 1992 సంవత్సరంలో ఏర్పాటు చేసిందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనైన శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు, మత ఘర్షణలు జరుగుతున్నప్పుడు అదుపు చేయడం ఈ ఫోర్స్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కామారెడ్డిలోని భౌగిళిక పరిస్థితులను తెలుసుకునేందుకు ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్‌రోడ్డు, డైలీమార్కెట్, సుభాష్‌రోడ్డు, పాంచ్‌చౌరస్తా, బడా మసీద్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, రైల్వేగేట్, బతుకమ్మకుంట, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, ఆర్‌ఐలు సంతోష్‌కుమార్, కృష్ణ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ బగేల్, ఇన్స్‌పెక్టర్‌లు హరిబాబు, మల్లేశ్వర్‌రావుపాల్గొన్నారు.

దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలి

జుక్కల్,మార్చి 4(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ప్రజలు దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ భువనేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక,మహారాష్ట్రసరిహద్దులో జుక్కల్ మండలం ఉండడంతో వేసవి కాలంతో ఇతర రాష్ట్రాల నుండి దొంగలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రోడ్డుపై వెళ్తున్న పాదచారులు ముఖ్యంగా మహిళలు వారి మెడలో ఉన్న బంగారు నగలను దోచుకుని వెళ్తున్న సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్నందున మహిళలు జాగ్రత్త వహించాలని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ కుటుంబయాజమానులు వారి ఇంటి ఆవరణలో పశువులు ఉండడం వల్ల వాటికి కాపాల కాయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి దొంగలు రాకుండా పోలీసుశాఖ తరపున నిఘాఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుశాఖ లక్ష్యమని తెలిపారు.

మోడల్ ఇందిరమ్మ ఇంటిని త్వరితగతిన పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ విక్టర్



భిక్కనూరులో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మోడల్ ఇందిరమ్మ ఇంటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ ఇందిరమ్మ ఇల్లును నాణ్యతతో నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగట్లపల్లిలో 5 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాట్లు

భిక్కనూరు మండలంలోని ఆదర్శ గ్రామం ర్యాగట్లపల్లిలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం ఐదు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మొదటి విడతగా ఐదు ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి సుడిగాలి పర్యటన

నిజాంసాగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలంలోని పలు గ్రామా గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి సుడిగాలి పర్యటన మంగళవారం చేశారు మల్లూరు తండాలో నర్సరీ పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని గ్రామపంచాయతీ కార్యదర్శి ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. విద్యాలయంలో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని ప్రత్యేక అధికారిని ఆదేశించారు. కొండపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. జాబ్ కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించేందుకు చర్య తీసుకోవాలని ఉపాధి హామీ ఏపీవోను ఆదేశించారు. వడ్డేపల్లి ఉపాధి హామీ పనుల్లో 200 మంది కూలీలు పనిచేస్తున్నట్లు ఉపాధి హామీ ఎపిఓ వివరించారు సుల్తాన్‌నగర్ గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైనందున మొదటి దశలో మంజూరైన 15 మంది ఇండ్లను నిర్మాణాలు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం



కస్తూర్బా విద్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

ఎంపీడీవో కార్యాలయంలో నీటి ఎద్దడి పై కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు గుర్తించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర్, గ్రామ కార్యదర్శిలు తదితరున్నారు.

జిల్లా అంతటా బీజేపీ విజయోత్సవ సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డులో బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్కా కొమురయ్య విజయం సాధించడంతో టపాకాయలు కాల్చారు. ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం కృషిచేసిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్ జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, నాయకులు నరేందర్, రవీందర్, విజయ్,రాజు, పాల్గొన్నారు.

బాన్సువాడ: ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా చారిత్రాత్మక విజయాన్ని సాధించిన బిజెపి అభ్యర్థి మల్కకొమురయ్య విజయం సాధించిన సందర్భంగా మంగళవారం బాన్సువాడ లోని దేశాపేట్‌లోని ఎస్ఆర్ఎన్‌కె డిగ్రీ కాలేజ్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాన్సువాడలో ఉపాధ్యాయులకు వందనం కార్యక్రమం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ పట్టభద్రుల ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, బీజేపీ రూరల్ అధ్యక్షులు మజ్జిగ శ్రీనివాస్, బీజేపీ నాయకులు కోణాల గంగారెడ్డి, హన్మాండ్లు, చీకట్ల రాజు, శివ శంకర్, శంకర్, డిజె సాయి, సాయి రెడ్డి, దత్తు సాయి ప్రసాద్, శివకు మార్, లక్ష్మణ్, రామకృష్ణ, సంతోష్, అంజయ్య పాల్గొన్నారు.

దోమకొండ: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతోనే బీజేపీ బలపరిచిన అభ్యర్థి మలక కొమరయ్య విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దూరి భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, అనుపాటి నరేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు చింతల రాజేష్, నర్సింలు, తిప్పాపురం రవి, సచిన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దరాములు, కొండల్‌రెడ్డి, గాజులపల్లి విఠల్‌రెడ్డి, నారాయణ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండల కేంద్రంలో మంగళవారం బీజేపీఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య విజయోత్స సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి హన్మండ్లు యాదవ్, జిల్లా ఓబిసి కార్యవర్గ సభ్యులు వడ్ల సతీష్, మండల ఉపాధ్యక్షులు అనుసూరి శ్రీనివాస్ రావు, కిసాన్ మోర్చా అధ్యక్షులు యాదగిరిగౌడ్, యువ మోర్చా అధ్యక్షులు మహేష్, మండల ఓబీసీ అధ్యక్షుడు లక్ష్మణ్, దళిత మోర్చా అధ్యక్షులు శేఖర్, శక్తి కేంద్రం ఇంచార్జి పెరక రామన్న, గంగాధర్ గుప్తా, బూత్ అధ్యక్షులు కంది పెద్ద మల్లేష్, సాయి పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కకొమురయ్య గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తు నాయకులు టపాకా యాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చాల జనరల్ సెక్రటరీ గంగారెడ్డి, సీనియర్ నాయకులు పిట్లశ్రీను, దగ్గి నరేష్, స్వామి, నాగరాజు, ప్రవీణ్, లక్ష్మన్‌స్వామి, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించారు. ఈ మేరకు బీర్కూర్ మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు తది తరులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: ఉమ్మడి కరీంగనగర్ , నిజామాబాద్ , ఆదిలాబాద్ , మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య విజయం సాధించడంతో మంగళవారం బాన్సువాడ బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులున్నారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్‌లైన్స్

కామారెడ్డిటౌన్,మార్చి 4(ఆంధ్రజ్యోతి):సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా యూజీసీ గైడ్‌లైన్స్ ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం అన్నారు. మంగళవారం కామారెడ్డి డిగ్రీకళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. వెంటనే ఆ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని తెలి పారు.ఈ కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్,నవీన్, కృష్ణ, గణేష్, నవీన్,పవన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి

నాగిరెడ్డిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డి పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అక్కం విష్ణు తెలిపారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో అధికారులు మంగళవారం హాల్ టికెట్ నెంబర్లను వేశారు. మండల కేంద్రం లోని మోడల్ స్కూల్, సిద్ధార్థ జూనియర్ కళాశాలలకు చెందిన 313 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.పరీక్షల నిర్వహణకు గాను చీఫ్ సూపరింటెండెంట్ తో పాటు డిపార్టుమెంట్ అధికారిగా ఎం.అంజయ్య 12 మంది ఎనిమిది ఇన్విజిలేటర్ లను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు, విద్యార్థులు గంట ముందు ఉదయం 8 గంటల వరకే పరీక్ష కేంద్రానికి రావాలని ఆయన కోరారు. కళాశాల చుట్టుప్రక్కల 144 సెక్షన్ విధిస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

రామారెడ్డి: ఇంటర్మీడియట్ పరీక్షలను నేటి నుంచి నిర్వహిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేం ద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 163 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని కళాశాల ప్రిన్సిపల్ పెద్ద నారాయణ పేర్కొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనుల పరిశీలన

నసురుల్లాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు చేపడుతున్నకాంట్రాక్టర్ సిద్ధిరాములుకు ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణ పనులు ఏ విధంగా చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి, త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట సిహెచ్‌వో దయానంద్, సూపర్‌వైజర్ గౌస్, డిఈఓ రాహుల్, ఈఈ అంజనేయుడు, పిఆర్ఏఈ గోపీనాథ్, కాంట్రాక్టర్ సిద్ధిరాములు ఉన్నారు.

రైతులు పాంపాండ్ నిర్మించుకోవాలి

బీబీపేట,మార్చి 4(ఆంధ్రజ్యోతి):ఆసక్తి కలిగిన రైతులు ఫాంఫొండ్ నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని జనగామ గ్రామ ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పాంపాండ్ నిర్మాణానికి ఆసక్తి కలిగిన రైతులు ఆయా గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పూర్ణచంద్రోదయ కుమార్, ఏపీఓ రజిని, టెక్నికల్ అసిస్టెంట్ వినయ్, జనగామ గ్రామపంచాయతీకార్యదర్శి కళ్యాణ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

గౌరారంలో అఖండహరినామ సప్తాహ

పిట్లం మార్చ్ 4:గౌరారం గ్రామంలో మంగళవారం అఖండహరినామ సప్తహ గ్రామాస్తులు ఘనంగా నిర్వహించారు.పోచయ్యమహరాజ్, రాజేశ్వర్ పంతులు ముఖ్యఅతితిలుగా సప్తహలో పాల్గోన్నారు.భక్తులు ఉదయం నుంచి సప్తాహ ముగింపు కార్యక్రమంలో గ్రామాస్తులు కళాశాలను ఎత్తుకొని సప్తహ వద్ద ముగింపు చెసినారు.ఆనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

కొలనుపాకకు మహా పాదయాత్ర

బీర్కూర్,మార్చి 4(ఆంధ్రజ్యోతి):యాదాద్రి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో మహా పుణ్యక్షేత్రమైన ఆది జగద్గురువు రేణుకా చార్య భగవత్పాదుల జయంతోత్సవాలను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం సుంకిని గ్రామం నుంచి వేలాది సంఖ్యలో భక్తులు మహా పాదయాత్ర చేపట్టారు. ఈమహా పాదయాత్ర మం గళవారం బరంగేడ్గి, బీర్కూర్, కిష్టాపూర్, దామ రాంచ మీదుగా బాన్సువాడకు చేరుకుంది. ఈ సం దర్భంగా నాగ భూషణ స్వామి మాట్లాడుతూ ప్రతీ సారిలాగే ఈ ఏటా మహా పాదయాత్ర చేప ట్టామ న్నారు. ఈ పాదయాత్ర ఈ నెల 3న సుంకిని గ్రా మం నుంచి ప్రారంభమైందని 12వ తేదీ కొలను పాకలోని మహా పుణ్య క్షేత్రమైన రేణుకా చార్యులు సోమనాథ్ పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందని తెలి పారు.కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మహాపాదయాత్రగా కొలనుపాకకు చేరుకుంటారని అన్నారు.ఆది జగద్గు రువు రేణుకాచార్య భగవత్పాదుల జయంతోత్సవ మహా పాద యాత్ర మంగళవారం కోటగిరి మండలం సుంకిని గ్రామం నుంచి సద్గురు సిద్ధప్ప మహా రాజ్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది.మహిళలుఈపాదయాత్ర కొనసాగుతున్నారు.

కోట దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

బాన్సువాడ,మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగల్లిలో గల శ్రీకోట దుర్గమ్మదేవి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల రాజులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దండి స్వామి, భాస్కర్, స్వామి చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేకపూజలో భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి ఆత్మహత్య

తాడ్వాయి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీకలాన్ గ్రామానికి చెందిన బంగారు గళ్ల అభిజిత్ (24) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పని చేయకుండా జులాయిగా తిరుగుతున్న అభిజిత్‌ను నానమ్మ నర్సవ్వ పని చేయమని మందలించగా మనస్తాపానికి గురై ఈనెల 1వ తేదీన పురుగుల మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అభిజిత్ మృతి తో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నానమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడి మృతి

తాడ్వాయి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు మక్కాయ్ బాలయ్య అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఇతని మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని అన్నారు. ఈయన మృతితో గ్రామం లో విషాదఛాయలు అలుముకున్నాయి. మండల నాయకులు అంత్యక్రియ లకు హాజరయ్యారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

లింగంపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందని కమ్మరి ప్రవీణ్‌కుమార్(27)ఇంట్లోదులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అతని అక్క మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులు, అక్కభర్త గతంలోనే మరణించడంతో అక్కపిల్లలు,ప్రవీణ్ కుమార్ లు శెట్పల్లిలోని ఇంట్లో ఉంటున్నారు.ప్రవీణ్‌కుమార్ తల్లిదండ్రులు లేక, తనకు పెళ్లి కాకపోవడంతో మనస్థాపం చెంది అక్కమౌనిక బంధువుల ఇంటికి వెళ్లగా ఒంటరిగా ఉన్న ప్రవీణ్‌కుమార్ మనస్థానంతో ఇంట్లో నైలా న్ తాడుతో దులానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పిట్లం: మండలంలోని చిల్లర్గి గ్రామానికి చెందిన ప్రకాష్ (37) మద్యానికి బానిసై ఇంట్లో ఉరేసుకొని మృతి చెందడం జరిగిందని ఎస్సై రాజు తెలిపారు.మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల చిల్లర్గి గ్రామానికి చెందిన ప్రకాష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యానికి బానిసై, సంసారం పాడుచేసుకొని మనస్థాపం చెంది ఇంట్లో ఉరి వెసుకొని మృతి చెందినాడు.మృతుని భార్య తులసి పిర్యాదు మెరకు కెసు నమోదు చేశామని, మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

నిజాంసాగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు పడలేక 26 సంవత్సరాల యువకుడు నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామానికి చెందిన అందాల అరుణ్‌కుమార్ 26 సంవత్సరాలు ఈనెల 1వ తేదిన షాపుకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడని ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించిన హరికుమార్ ఆచూకి లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టు గుల్లస్తి వద్ద నీటిలో శవమై కనిపించాడు. గ్రామస్తులు కుటుంబ సభ్యులు హుటాహుటిన వెళ్లి పరిశీలించగా హరికుమార్ మృత దేహం అని నిర్ధారించారు. హరికుమార్ మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులకు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిర్వహించి పోస్టుమార్టం చేయించినట్లు ఆయన తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి రూ.40 వేల జరిమానా

పెద్ద కొడప్‌గల్, మార్చి 04 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ గ్రామం నుంచి కాటేపల్లి గ్రామానికి వేల్లే రహదారిలో గతంలో అధికారులు హరిత హారం పథకం కింద మొక్కలు నాటారు. అవి పెరిగి పెద్దగా మారాయి. గత కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న వెంచర్‌లో ఇల్లు నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మించే ప్రాంతానికి విద్యుత్ సరఫరా చేసే వైర్లకు చెట్లు అడ్డువస్తున్నాయనే ఉద్దేశ్యంతో రహదారికి పక్కన ఉన్న చెట్లను నరికివేశారు. దీంతో ఈ విషయం వెలుగులోకి రావడంతో విచారణ జరిపిన అధికారులు చెట్ల నరికివేత ఘటనకు కారణమైన వ్యక్తికి 40 వేల రూపాయల జరిమానా విధించారు. దీంతో ఆ వ్యక్తి మంగళ వారం 40 వేల రూపాయల జరిమానా చెల్లించినట్లు ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. దీంతో సదరు వ్యక్తి 40 మొక్కలను తీసుకవచ్చి నాటుతానని అధికారులకు సంజాయిషీ ఇచ్చారు.

కొత్త వారికి ఉన్నత పదవులు ఇవ్వొద్దు

రామారెడ్డి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో, ప్రతిపక్షంలో ఉండి కష్టపడిన నాయకులు, కార్యకర్తలు అక్రమ అరెస్టులకు కూడా భయపదకుండ, పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారిని గుర్తించేందుకు కృషి చేయాలని రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గీరెడ్డి మహేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తూర్పురాజు, ప్రవీణ్, కిషన్, రవి, నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల విహార యాత్ర

పెద్ద కొడప్‌గల్, మార్చి 04 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మంగళవారం హైదరాబాద్‌లో గల జూ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతు విద్యార్థినులకు అటవీ జంతువులపై అవగాహన కల్పించేందుకు చిన్నారులను జూ పార్క్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతి నిత్యం పాఠశాలలో పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులకు ఇటువంటి విహార యాత్రల ద్వారా ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాములు, విఠల్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను శాస్త్రీయ బద్ధంగా పరిష్కరించాలి

● కామారెడ్డి జిల్లా పర్యవేక్షకుడు, మంథని సామ్యేల్ మాదిగ

రామారెడ్డి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను శాస్త్రీయ బద్ధంగా పరిష్కరించాలని, అన్ని కులాలకు వారి వెనుకబాటు తనం, జనాభా నిష్పత్తి ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ దళిత నాయకులు డప్పు కొట్టుతూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యేల్ మాదిగ, మండల అధ్యక్షులు రాజనర్సు మాదిగ, మహిళా విభాగం అధ్యక్షురాలు బానాపురం లావణ్య మాదిగ, మండల ఉపాధ్యక్షుడు కాస్తారి శైలేష్ మాదిగ, నాయకులు నవీన్, సాయిలు, మహేందర్, లింబాద్రి, రాకేష్, మధుసూధన్, ప్రతాప్, రాజశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - చావా

ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్

ప్రియా 35 - శబ్దం

బాన్సువాడ

మహేశ్వరి - లైలా

వెంకటేశ్వర - చావా



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

